క్లుప్తంగా

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు కోడుమూరు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ముఖ్యంగా ఏళ్ల తరబడి మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏఐఎస్ఎఫ్ స్థానిక నాయకులు వీరేంద్ర, అల్తాఫ్‌బాషా, మాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటసుబ్బయ్య

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో నంద్యాల–నందికొట్కూరు రహదారిపై అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గడిగరేవుల గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య సొంత పనుల నిమిత్తం నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. దీంతో గ్రామస్తులు క్షతగాత్రుడిని ఆటోలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి



కరిమద్దెల గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

గడివేముల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో సోమవారం గ్రీన్ అంబాసిడర్లకు బట్టలు, చెప్పులు, మాస్కులు అందజేశారు. గ్రామంలో పలు వీధులను పరిశీలించి మురుగునీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. చెత్తను ఇంటి బయట పారవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మహీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

గడివేముల: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండలకేంద్రం గడివేములలో అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తారు. అయితే, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావడం లేదు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు తహసీల్దార్, ఎంపీడీఓ,ఏపీఓ, ఐసీడీఎస్, డిప్యూటీ ఎంపీడీఓ తప్ప మిగతా శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఫిర్యాదు చేడానికి వచ్చిన ప్రజలు సంబంధిత శాఖల అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి పట్టా పంపిణీ

కల్లూరు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎ.గోకులపాడు గ్రామానికి చెందిన ఎస్.రహమతుల్లాకు తహసీల్దార్ ఆంజనేయులు సోమవారం ఇంటి పట్టా అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు సదరు వ్యక్తి అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కల్లూరు రెవెన్యూ అధికారులు విచారించి రహమతుల్లాకు ఇంటి పట్టా అందజేశారు. దీని కోసం గత 15 సంవత్సరాలుగా అధికారుల చుట్టు తిరిగినట్లు వెల్లడించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

కల్లూరు: 28వ వార్డులోని బీఆర్ రెడ్డి కాలనీలోని డ్రైనేజీలో మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ఆ కాలనీలో పర్యటించి విలేకరులతో మాట్లాడారు. వర్షం పడినప్పుడు కాలువలోని మురుగునీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యూరియా నో స్టాక్

- సహకార సంఘాల్లో నిల్వలు నిల్
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కర్నూలు(రూరల్): కేసీ కెనాల్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడంతో ఆయా గ్రామాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. అయితే పైరు ఎదుగులకు ప్రధానమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

సహకార సంఘాల్లో యూరియా నిల్వలు ఖాళీ

రైతులకు సేవలందించేందుకు ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతుంటాయి. మండల పరిధిలో నాలుగు సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. గార్గేయపురం, పసుపల సంఘాల్లో యూరియా కొరత ఉండటంతో ఆయా గ్రామల రైతుల ఇబ్బందులు పడుతున్నారు. గార్గేయపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి గత 20 రోజులకు పైగా యూరియా రాకపోవడంతో ఆ గ్రామంతోపాటు, దిగువపాడు, శివరామాపురం రైతులు యూరియా కోసం కేంద్రానికి రాగా సిబ్బంది నో స్టాక్ అని చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం కర్నూలు జిల్లాలో అతిపెద్ద సంఘంగా పేరొందింది. గతంతో ఈ కేంద్రానికి ఎప్పుడూ యూరియా కొరత లేదు. అయితే గత నెల నుంచి ఈ కేంద్రంలో కూడా యూరియా నిల్వలు లేవు. యూరియా లోడు వచ్చింది వచ్చినట్లుగా అయిపోతుంది. దాదాపు 5 వేల మంది సభ్యులు ఉన్న సంఘంలో యూరియా రైతులకు సక్రమంగా అందడం లేదు. స్టాక్ వచ్చిన వెంటనే పరుగెత్తుకొచ్చిన వారికి యూరియా అందుతుంది. ఆలస్యంగా వచ్చిన వారికి యూరియా మొత్తం అయిపోవడంతో సిబ్బది నో స్టాక్ అని చెప్పి పంపుతున్నారు. బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, పడిదెంపాడు, పూడూరు, సూదిరెడ్డిపల్లె, నూతనపల్లె, నందనపల్లె, వెంకాయపల్లె, మిలటరీకాలనీ, పి.రుద్రవరం రైతులు యూరియా కోసం ఎదరు చూస్తున్నారు. అక్కడున్న అధికారులు స్టాక్ వచ్చినప్పుడు తెలియజేస్తాం అని చెబుతుండటంతో చేసేది లేక స్టాక్ ఎప్పడొస్తుందోనంటూ రైతులు నిరాశతో వెనుతిరుగుతున్నారు.



పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

లోడు రాగానే రైతులకు పంపిణీ చేస్తాం

గత 20 రోజుల నుంచి గార్గేయపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా స్టాక్ రాలేదు. దీనిపై కర్నూలు మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. రేపు యూరియా స్టాక్ వస్తుంది. స్టాక్ వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

– పి.కోటిరెడ్డి, గార్గేయపురం పీఏసీఎస్ కార్యనిర్వహణ అధికారి

పాణ్యంలో..

పాణ్యం: కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైంది. రైతులకు భరోసా లేకుండా పోయింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా రైతులకు యూ రియా సరఫరా లేదు. ఎన్నడూ ఈ విధమైన కృత్రిమ కొరత ఏర్పడలేదు. ఏ రైతును కదిలించినా రెండు బస్తాలు యూరియా ఇప్పిస్తే చాలని వేడుకుంటున్నారు. అధికారులు వచ్చిన యూరియా మొత్తం రైతులకు పంపిణీ చేస్తున్నారు. అయితే దిగుమతి సరిగ్గా లేకపోవడంతో రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. వ్యవసాయానికి సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభు త్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నామన్నా రు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకపోతే రోడ్లపైకి రావాల్సి ఉంటుందని రైతులు హెచ్చరిస్తున్నారు.

నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటు చేయాలి



కోడుమూరులో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: కర్నూలు నుంచి బళ్లారికి నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు గఫూర్‌మియ్యా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. కర్నూలు నుంచి బళ్లారి వెళ్లే రోడ్డులో రోజురోజుకు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ముఖ్యంగా ఏపీ నుంచి కర్ణాటక వెళ్లేందుకు ఎక్కువమంది వాహనదారులు ఈ రోడ్డునే ఉపయోగిస్తున్నారని, రోడ్డు చిన్నగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పాటు, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి కర్నూలు నుంచి బళ్లారికి నాలుగు లైన్ల రోడ్డు నిర్మించడంతో పాటు, కోడుమూరులో బైపాస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులు వీరన్న, బుడ్డప్ప, కరీంబాషా, నాగరాజు, జీపీ.వీరన్న, శ్రీరాములు, అర్జున్, తాయప్ప, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లి పాలు శ్రేయస్కరం



మాట్లాడుతున్న కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియ శుభప్రద

కర్నూలు(రూరల్): శిశువుకు తల్లిపాలు పట్టడం వల్ల తల్లీబిడ్డకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ ఉల్చాల గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియా శుభప్రద పాల్గొన్నారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, ఎల్.వి.టి.కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమానికి హాజరైన మహిళలకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ.. శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ ఆరోగ్యంతోపాటు తల్లికి క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఎల్.వి.టి.జి. కాలేజీ ఫ్యాకల్టీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులు తయారుచేసిన వివిధ ఆర్టికల్స్ ప్రదర్శిస్తూ తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ విద్యాసాగర్, డాక్టర్లు అరుణ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, మంజూష, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు: సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న తరుణంలో వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సునీల్ కు మార్ ప్రజలకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ, శిశువు భద్రతలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ సెల్ ఫోన్లు వినియోగించే మహిళలు తెలియని లింకులను క్లిక్ చేయడం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర అంశాలపై వ్యక్తిగత ఓటీపీ చెప్పరాదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పోస్టు చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతారన్నారు. సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీ చిత్రాలు పోస్టు చేస్తే ఎదురయ్యే పరిణామాలు, డిజిటల్ అరెస్టులు, రుణయాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని హైదర్‌ఖాన్, జొహరాపురం, బుధవారపేట ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వ ర్యంలో కలెక్టరేట్ ఎదుట ఇళ్ల పట్టాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా కాలనీల్లో దాదాపు 20 ఏళ్ల నుంచి పేదలు నివాసం ఉంటున్నా పట్టాలు ఇవ్వడం లేదన్నారు. జొహరాపురంలో బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా వాటికి సంబంధించిన పట్టాలను హౌసింగ్ కార్యాలయాల్లోనే ఉంచుకున్నారన్నారు. ఇప్పటివరకు ఒక్కరికీ కూడా ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం జీఓ నంబర్ 30ని విడుదల చేసిందని, ఈ జీఓ ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వొచ్చని, అయితే కేవలం పెద్దలకు మాత్రమే ఆ జీఓను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నాయకులు విజయ్, షరీఫ్, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడేషన్లను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేసి ఉచితంగా వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సొంతిల్లు లేని జర్నలిస్టులకు 5 సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టి రక్షణగా నిలిచేందుకు జర్నలిస్టు రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఆక్రమార్కుల నుంచి రక్షణ కల్పించాలని, వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. నగర కమిటీ గౌరవాధ్యక్షుడు శివకుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివశంకర్, ఎర్రమల, నాయకులు రఫీ, బీముడు, శీను, రమేష్, మణిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



సి.బెళగల్‌లో రైతు సమస్యను తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మండల ప్రజలు సమర్పించిన అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. ఆమె సోమవారం మండల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి తన కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరుణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ పీజీఆర్ఎస్ నిర్వహించగా డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఏపీఓ రామన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తదితరులు హాజరయ్యారు.

ధూమపానంతో క్షయ ముప్పు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అబ్దుల్ అనిద్

కర్నూలు(రూరల్): పొగ తాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు అబ్దుల్ అనిద్ చెప్పారు. ఆయన సోమవారం కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, 60 ఎళ్లు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ వాహన్, నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా గ్రామంలో ప్రజలకు టీబీ గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రమణ, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, హెల్త్ సూపర్ వైజర్ నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



నగదు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ. 1.50 లక్షలు విరాళంగా అందించినట్లు ఈఓ రామక్రిష్ణ సోమవారం తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఎ. నాగప్రసాద్ కుటుంబ సభ్యులు అన్నదానం కార్యక్రమం నిర్వహణకు రూ. లక్ష, ఆదోని పట్టణానికి చెందిన కమలాపురం వెంకటేష్ కుమారుడు అవినాష్ కుటుంబ సభ్యులు ఆలయఅభివృద్ధికి రూ. 50 వేలు విరాళంగా అందించారన్నారు. అనంతరం ఈఓ దాతలకు శేష వస్త్రాలు అందించి తీర్థప్రసాదాలు అందించారు.

ఓర్వలేక దుష్ప్రచారం

ఓర్వకల్లు: ప్రజల నుంచి పైసా ఆశించకుండా ఓంశాంతి మందిరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు లభిస్తున్న ఆదరణను చూడలేక ఓ ప్రైవేట్ ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకురాలు తనపై, సంస్థపై దుష్ప్రచారం చేస్తుందని బ్రహ్మకుమారుడు రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఓర్వకల్లులో విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థలో శిక్షణ పొంది ఓర్వకల్లులో ఓంశాంతి మందిరాన్ని స్థాపించినట్లు తెలిపారు. దాదాపు 25 ఏళ్లుగా నిస్వార్థంగా సేవలందిస్తున్న తనపై మహిళలను వేధిస్తున్నట్లు నిరాధర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బహిష్కరిస్తామని స్థానికులు నాగేంద్రారెడ్డి, నరసింహారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.


6న జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6వ తేదీన జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బీ.భూపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 4400 మీటర్ల పరుగుపందెం, షాట్ ఫుట్, లాంగ్ జంప్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో ఈ పోటీలు ఉంటాయని, 22 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఆధార్‌కార్డు, ఐడీ కార్డు రుజువుతో హాజరు కావాలని, వివరాలకు 90004 93408 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఇస్కాన్‌లో జులన్ యాత్ర

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీ రాధామాధవుల జులన్ యాత్ర, సంకీర్తన ఉత్సవాలను మంగళవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు, బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

హామీలు అమలు చేయాలి



సీడీపీఓ అనురాధకు సెల్‌ఫోన్లను తిరిగిచ్చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కర్నూలు (న్యూటౌన్): అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పని చేయని సర్వర్లతో టీచర్లకు భారంగా మారిన యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బాలదుర్గమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఓటీపీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని నిబంధనలు పెట్టడంతో అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరుకులు అన్నీ ఒకేసారి రావడం లేదని, సిగ్నల్ సమస్యతో సరుకులు చేర్చలేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్ అవుట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వర్లు పని చేయడం లేదని, అన్ని యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను అమలు చేయాలని కర్నూలు సీడీపీఓ అనురాధకు సెల్‌ఫోన్‌లను, సిమ్‌కార్డులను వెనక్కి ఇచ్చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

అర్జీ ఇవ్వాలంటే అవస్థలు పడాల్సిందే!



కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కూర్చోవడానికి కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు

కర్నూలు(రూరల్): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు, రైతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు వస్తుంటారు. ఆయా కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేక నిలబడి ఉండాల్సిన పరిస్థితి. కాళ్లనొప్పులున్న వారైనా, దివ్యాంగులైనా సరే ఎంతసేపైనా నిలబడి ఉండాల్సిందే. అధికారులు సమావేశంలో ఉంటే సమావేశం ముగిసే వరకు వేచి ఉండాలి. అలాగే పని మీద బయటికి వెళ్లినా వారు తిరిగివచ్చే వరకు అక్కడే నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రతి వారం ఉండేదే. ఈ క్రమంలో సోమవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు, గర్భిణులు, చంటి పిల్లలతో వచ్చిన బాలింతాలు కూర్చునేందుకు కుర్చీలు లేక అవస్థలు పడ్డారు. అర్జీ ఇవ్వాలంటే ఇన్ని అవస్థలు పడాల్సిందేనా? సమస్యలు పరిష్కరిస్తారనే భరోసాతో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయ్యాలని అర్జీదారులు కోరుతున్నారు.

దంచికొట్టిన వర్షం



ఓర్వకల్లులో నీట మునిగిన మొక్కజొన్న పంట



కల్లూరులో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు



లొద్దిపల్లెలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు

ఓర్వకల్లు/కల్లూరు: ఓర్వకల్లు, కల్లూరు తదితర మండలాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా..వాహనాల రాకపోకలు స్తంభించాయి. పంటపొలాలు నీట మునిగాయి. లొద్ది పల్లె గ్రామంలో పలువీధులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పడమటి వాగు, తూర్పువాగు ఏకం కావడంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. ఈ గ్రామ శివారులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వరదనీరు స్థానిక పాఠశాల ఆవరణలోకి ప్రవేశించడంతో పాఠశాలకు అధికారులు సెలవు ప్రకటించారు. తహసీల్దార్ విద్యాసాగర్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షానికి చాకలి భూషన్న, కురువ సామన్న ఇళ్ల గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కల్లూరు మండలంలో 41.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు నిల్వ

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో 8.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఎస్ఈ సుభకుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 14 వేలు క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి గాలేరు నగరి సుజల ప్రవంతికి 16వేలు క్యూసెక్కుల నీరు పంపుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఎస్సార్బీసీ బైపాస్ నుంచి 1300 క్యూసెక్కుల నీరు పంపుతున్నామన్నారు. మరమ్మతుల అనంతరం గోరుకల్లు జలాశయంలో పది టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంచుతున్నట్లు చెప్పారు. పై నుంచి వచ్చిన ఇన్‌ఫ్లోను గాలేరు ద్వారా పంపుతున్నామన్నారు.